


# స్వేచ్ఛ సంగీత రాగం

## 'శ్రీవిరించి'

"ఈ పుస్తకాలు తీసుకువెళ్లవచ్చా" అన్నాడు ప్రసాద్.

"అప్పుడే చదివేశారా?"

"రెండుసార్లు అయింది."

ఆమె పుస్తకాలు అందుకుంటూ నవ్వింది. సరిగా ఆ సమయానికి ఆమె ముఖంలోనికి చూచాడు ప్రసాద్. "ఎందుకు నవ్వుతున్నావు?" అని అడిగాడు.

"నిన్నటి సంగతి గుర్తుకువచ్చింది."

'ఏమిటది?' అని అతను అడగలేదు. కాని కనుబొమ్మలు ముడిచి ఆమెవంక చూశాడు. ఆమె విశదీకరించ పూనుకుంది.

"నిన్న మిమ్మల్ని గురించి ప్రస్తావన వచ్చింది. అప్పుడు రామారావు 'సులలితంగా సుకుమారంగా ఫిడేలు వాయించడం తప్ప ప్రసాద్‌కు యింకేంరాదని' అన్నాడు. కాని మీకు చేతనయిన విద్య మరొకటి వుందని ఎవరికీ తెలిసినట్లు లేదు." అని ఆమె మళ్లీ నవ్వింది.

"ఏమిటేమిటి అది?" అన్నాడు కొంచెంగా ఆమెవైపు అంగలువేస్తూ.

"వేరే చెప్పాలా? పుస్తకాలు చదవడం. లైబ్రరీలనుంచి మీకు కావలసిన పుస్తకాలు మోసిమోసి నాచేతులు కాయలు కాస్తున్నాయి." అతనికోసం యిబ్బంది పడటంలో వున్న సుఖం ఆమె కంఠస్వరంలో స్పష్టంగా వినిపిస్తోంది.

ఆ రోజు ఉదయం నిద్రలేవడంతోటే గది గోడలవంక తేరిపారచూచాడు ప్రసాద్. అవే గోడలు. వాటిలో రంధ్రాలు, మరకలు, మాసికలు అన్నీ వాటి వాటి స్థలాలలో సురక్షితంగా వున్నాయి. పగలూ రాత్రి తను చేస్తున్న తపస్సు వాటిమీద యేమయినా ప్రభావం చూపుతోందా అని కొంతసేపు గమనించడం అతనికి అలవాటు అయింది.

తూర్పువయిపు గోడకు వున్న గడియారం టిక్ టిక్‌మని చప్పుడు చేసింది. మీడియమ్‌సైజు రిఫ్రిజిరేటర్ ఒక

మూల చిన్న పర్వతంలాగ స్థావరించుకుని వుంది. గది వెనుకపక్క నున్న 'సింక్,' దాని తాలూకు మాదకపు వాసన అతనికి అలవాటు అయిపోయినాయి.

ప్రతిరోజు మాదిరే ఉదయం ముఖం కడుక్కున్న తరువాత నాలుగు బ్రెడ్ ముక్కలు 'టోస్టర్' మీద వేయించుకుని 'పీనట్ బటర్' పూసుకుని తిన్నాడు. బ్రెడ్, బటర్, జామ్ యిలాంటి చిరు తిండి పదార్థాలన్నీ అమె తీసుకవచ్చి యిస్తుంది. పుస్తకాలు కూడా అమే అందచేస్తుంది. ఫిడేలు, కమాను, దాని తీగలుమాత్రం అతని స్వంతం. అలవాటుగా వాయిస్తూ కూర్చుంటాడు. అతనికి 'టైం'తో పనిలేదు,

వాద్యం కిందపెట్టిన తరువాత ఆ చేతులలోనికి పుస్తకం తీసుకుని దక్షిణపు గోదవార కిటికీదగ్గర కుర్చీవేసుకుని కూర్చున్నాడు. పేజీలమీదే ధ్యాస. అయినా కిటికీలోనుంచి అప్పుడప్పుడు బయటికి చూస్తున్నాడు. లోపల్నుంచి వచ్చే వేడికి కుర్చీ ఉడికిపోతోంది. పైన తిరుగుతున్న 'ఫేన్'కు లయగా పుస్తకంలోని పదాలు అర్థంమార్చుకుంటూ గిరగిర తిరుగుతున్నాయి. పుస్తకం పక్కన పెట్టి కాస్సేపు గదిలోనే అటు యిటు పచార్లుచేశాడు; చాల నిదానంగా తాపీగా ఆలోచనగా అడుగులువేస్తూ.

జయ-తను యిద్దరూ కూర్చునేచోటు, కాఫీ తాగేచోటు, పడుకునే మంచం.... యివన్నీ పదానించి చూశాడు. ఆమెకు పగలు, రాత్రి అనే భేదంలేకుండా నిర్విరామంగా వుండవలసిన ఉద్యోగం వుంది. అందుచేత యే రోజు యే సమయంలో 'ఫ్రీ'గా వుంటుందో తెలియదు. తీరుబడిగా వున్నప్పుడు యిక్కడకు వచ్చి కొంతసేపు వుండి తరువాత అంతర్ధానం అయిపోతుంది. మళ్ళి ప్రత్యక్షం అయేవరకు కనిపించదు 'జయ' అతనికి.

'ఇక్కడ కూర్చున్న గంటో గంటన్నరో మటుకే నాకు విశ్రాంతి. తతిమ్మా టైమంతా ఉరుకులు పరుగులతో సరిపోతుంది' అంటుంది జయ.

బహుశ ఆ విశ్రాంతికోసరమే యిక్కడకు వస్తుందేమో! తన సంగీతం వినడంకోసం కాదేమో అనుకుంటాడు ప్రసాద్ ఒక్కోమారు.

తను సంగీతం వినిపించకుండా తాపీగాకూర్చుంటే 'ఫలాన రాగం వాయించండి' అని పురమాయిస్తుంది.

'ఎంత సేపూ సంగీతమేనా?.... యింకేదయినా కబుర్లు చెప్పు' అని పైకి మాత్రం తను అనదు.

తనంత తను యేదయినా కబుర్లు చెబితే విందామని వుంటుంది అతనికి.

కాని ఎంతసేపూ జన్యరాగాలు- జనకరాగాలు- మేళకర్తలు- సృష్టికర్తలు- లలితసంగీతం- భావసంగీతం- ఎప్పుడూ యిదే చర్చ, ధోరణి. ఎంతో అభిరుచి కలిగించేదే అయినా చేదు

ఎక్కుతోంది.

పార్కులో ఆడుకుంటూ పరుగెత్తే పిల్లలు ఎటువెళ్ళిపోతారో అన్న భయం లేదు. రాగంలో యింకో స్వరం పడిపో తుందేమోనని మాత్రం భయం.

పిల్లవాడికి జ్వరం ఎప్పుడు తగ్గుతుందా అని బెంగలేదు; స్వరం తాళానికి రాదేమోనని బెంగ.

ఫిడేలు రాగాలు ఎన్ని భజన్లు!

తాళాలు వాద్యాలు ఎన్ని సోక్ర్లు!

ఎదురు చూడడంలో నే అతనికి అపేక్ష, ఆనందం కరిగిపోతాయి. కాని ఆమెకు అతని హృదయం లోతులు తెలియవు.

ఉదయాలు అతనికి ఎంత ఆప్యాయం అయినవో అర్థంకాదు. ఆమె యేమీ విడమరచి చెప్పదు. ఆ ప్రయత్నమే చేయదు. హడావుడిగా దుస్తులు మార్చుకుని పరుగులు తీయడంతోనే సరిపో తుంది సమయం అంతా.

తీయగా నిట్టూర్పు విడుస్తాడు ప్రసాద్.

అతనికి కిటికీలోనుంచి నగరవీధులు, ఆరుబయట కనిపిస్తాయి. పగలు సూర్యుడి తాపం ఎక్కువయినకొద్దీ వీధులలో జనసంచారం కూడా పెరుగు తుంది. నడిచేవాళ్లు, బండ్లు, సైకిళ్ల, స్కూటర్లు, కార్లు- అన్నీ కళ్లముందు తార్రోడ్‌మీద ముందుకుపోతూవుంటాయి. వాటివంక చూస్తూవుంటే అనేకనేక ఆలోచనలు వచ్చి మెదడులో చురుకుదనం ప్రవేశిస్తుంది. పుస్తకం చదువుతూ కూర్చున్నప్పుడు ఆ చదువులో భాగంగానే యీ దృశ్యాలన్నీ తిలకించడం అతనికి అలవాటు అయిపోయింది.

ప్రసాద్ ఒంటరి జీవితానికి అలవాటు పడిపోయాడు. ఆలోచనలు కదలబారిన ప్రతిమారూ పూర్వపు అందము, సౌందర్యము మానసిక నేత్రాలముందు సాక్షాత్కరిస్తాయి. ఉక్కిరిబిక్కిరి అయిపోతాడు. అసూయ ముంచెత్తి వేస్తుంది. రాక్షసో దయ్యమో ఆవహించినట్లు శరీరంలోని అంగంగాలను కైవశం చేసుకున్నట్లు మెలికలు తిరిగి పోతాడు.

మెల్లిగా అడుగులు వేసుకుంటూ కూలబడిపోయి సోఫాలోని దిండును అటుయిటు కదిలించాడు. దాన్ని తాకడంలో పైన అంటుకునివున్న వెంట్రుకలు చేతికి తగిలాయి. తల వెంట్రుకలు నిడుపయినవి. వాటి మనిషిని గురించి అంచనావేస్తున్న వాడిలాగ పరిశీలనగా చూస్తూ వుండిపోయాడు.

అతని గది చాలా పెద్దది.

తను తీరుబాటుగా చదువుకుందుకు కూర్చోవడంతోటే తతిమా గది అంతా తననే వేయికళ్లతో పరిశీలించటానికి అన్నట్లుగా వేచి కూర్చుంటుంది. అంత గదిలోనూ తను ఒక్కడే. తతిమ్మా ఖాళీజాగా తననుకూడా ఎవరయినా ఆక్ర

మించుకుంచే బాగుండును అని ఆసక్తిగా చూస్తూవున్నదా అనిపిస్తుంది తనకు.

నిజానికి యిద్దరు మనుష్యులు వుంటే యీ గది సమరసంగా రూపొందుతుంది వాళ్ల మాటలు, చేష్టలు యీ గదిలోని వాతావరణానికీ జడపదార్థంలాంటి గోడలకు, వస్తువులకు అతిసహజంగా సరిపడి పోతాయి. కాని రెండో మనిషి ఎక్కడ? ఉండవలసిన మనిషి మాయమైపోవడం తలుచుకుని ప్రసాద్ నీరసంగా తలవాల్చుకున్నాడు.

* * *

గది తలుపు తట్టిన శబ్దం అయింది.

ప్రసాద్ లేచి తలుపు తెరిచాడు. అతన్ని చూచి ఒక్క క్షణం విభ్రాంతిపోయినట్లు జయ తల వెనక్కు తాటించింది.

"ఎందుకట్లా ఉలిక్కిపడ్డావు! ఈ గదిలో నేనుగాక యింకెవరు వుంటారు?" అనడిగాడు. జయను దగ్గరకు తీసుకుని ఊరడిస్తున్నట్లుగా గుండెలకు ఆనించుకున్నాడు. జయ అలసట, విభ్రాంతిపాటు తీరేంతవరకు గట్టిగా అతనిలోనే యిమిడిపోయింది.

వాళ్ల కౌగిలింత కొలిచినట్లుగా నియమబద్ధంగా వుంటుంది. అతని చేతులు యెప్పుడూ ఆమె వీపుమీద ఒకే చోట స్పర్శిస్తాయి. ఒక్క సెంటిమీటరయినా అటుయిటు కదలవు, తొణకవు. ఒక చేయి మెడకింద మరో చేయి వెన్నెముక అడుగుభాగంలో. ఏదో గొప్ప సంకల్పం చేస్తున్నట్లు, మంత్రిస్తున్నట్లు కొన్ని క్షణాలు అలాగే వుండిపోతాడు. అతని తల తిప్పుడూ అదే పక్కకు వంగుతుంది అదే చెంపకు అతని చెంప అనుతుంది. జయ చెవులకిందినుంచి మెడ వెనకాల జుట్టులోనుంచి వచ్చేసుగంధం తాలూకు వాసనలు ప్రసాద్ ముక్కుపుటాలకు బాగా అలవాటు, చేరిక అయిపోయినాయి.

జయ శుచిగా శుభ్రంగా వుంటుంది. డాక్టర్ వృత్తికి సంబంధించిన రహస్య విశేషంగా భావిస్తాడు దానిని ప్రసాద్. తన కౌగిలింత కూడా ఆమె వృత్తి ధర్మంలో భాగం అయిపోయిందని పిస్తుంది చాలామార్లు.

ఆమె వచ్చేటప్పుడు అతి మామూలు చీర ధరిస్తుంది.

నీలం-పచ్చ-గోధుమ-యేదో రంగు చీర; అతి సాదాది. వెళ్లేటప్పుడుమాత్రం వేరేరకం దుస్తులు వేసుకుంటుంది. ఇవి ఎక్కువ అకర్షవంతంగా కళ్లకు జిగేలు మని కొట్టనచ్చేట్లుగా అనిపిస్తాయి.

ఈ రెండురకాల దుస్తులకు నడుమ మరో విధంగా ఆమె అతనికి మాత్రమే సాక్షాత్కరిస్తుంది. అప్పుడు సహజత సౌమ్యత ఉట్టిపడతాయి.

"ఈరోజు మిమ్మల్నితలుచుకున్నాను. ఎన్నాళ్లు అయిందిట మిమ్మల్ని చూసి" అంది జయ.

ఏమేమిటో అవసగారో కూడా అతను వివరించలేదు.

'అలాగే అడుగుతారు. వాళ్ల కేసులు' అనుకున్నా మనసులో.

"నా సంగతి గురించిలోను తిరగండి. మరీ యేకాంతం యెక్కువయితే–"

ఎలా జరగను? ఏమని తిరగను? యిదీ అతని మనసులోని ఘోష. జీవితం అంతా పూడుకుపోయిన మనిషి.

"జరిగినదానికి కుమిలి పోవడం మంచిదికాదని యే పుస్తకంలోనూ లేదా?– యిన్ని పుస్తకాలు చదువుతావు..." అంది మళ్లీ జయ.

"భవిష్యత్తును గురించి కూడా పెద్ద యెత్తున వూహించుకోగూడదని వుంది యీ పుస్తకాలలో. మనిషి యెప్పుడూ వర్తమానంలోనే జీవించాలి. గతంలో కాదు, భవిష్యత్తులో కాదు–" ఈ మాటలే ఆమెకు అర్థమయేట్లు నింపాదిగా చెప్పాడు.

"కాని మన జీవితం– వర్తమానం– యిదివరకు యెప్పుడో నిర్ణయం అయిపోయిందే గదా!"

"అవును. ఒక రకరంగా అంతే మనం పూర్వం చేసిన పనుల ఫలితమే యీ జీవితం– వర్తమానంలో. కాని ఆ ఫలితాన్ని స్వీకరించడంలో అనాసక్తత, ఉదాసీనం, రాగద్వేషాలు లేని స్థితే వుండవచ్చును–"

"ఎంత పూర్వనిశ్చితరాగం అయినా కొన్ని కొత్త పోకడలు పోవడానికి మార్గం వుంటుంది. కాని యేమీ చేయడం లేదు మనం–"

"యేమీ చేయకుండా వుండడం కూడా ఒక పనే."

వెళ్లిపోవలసిన సమయం ఆసన్నమయింది. జయ హుషారుగా తయారయి దుస్తులు వేసుకుంటోంది. అతను ఆమె కదలికలను చూస్తూ కూర్చున్నాడు, కంఠోపాఠంచేస్తున్న కుర్రవాడిలాగ.

ఒకసారి చదివేసిన పుస్తకాన్ని మళ్ళీ మళ్ళీ చదవవచ్చు. అదేపనిగా వాడిన యంత్రం మటుకు పాడయి మూల పడిపోతుంది. కాని ఆమె తనదగ్గరకు శుచిగా శుభ్రంగా వచ్చి తిరిగివెళ్లేటప్పుడు కూడా అలాగే యెక్కడా చెదరకుండా వెడుతుంది.

ఆమె వెళ్లిపోతున్నప్పుడు ఆ మార్గం మరింత దూరం అయినట్లు ఎంతో బరువుగా అనిపిస్తుంది.

* * *

ప్రసాద్ తలకిస్తూ కూర్చున్నాడు.

కింది తలుపులు తెరిచుకునేలోగా శబ్దం వినిపించింది.


క్రమంగా అడుగుల సవ్వడి పైకి వచ్చింది.

గట్టిగా భారంగా చప్పుడు.

బయట తలుపు మళ్లీ శబ్దంఅయింది.

ఈమారు నాజూకుగా వుంది చప్పుడు.

అతని గుండె చప్పుళ్లు కూడా నాజూ



కుగా సుకుమారంగా రూపొందినాయి.

ఆమే! ఆమే! అదే రంగుచీర!

తన గదివయిపే నడిచివస్తోంది— అనుకుందుకు వీలుగా అడుగులచప్పుడు— విరామం ముడుచుకుపోతోంది.

కాని అతనికి ఆతురత.

నిజమేనా? లేక ఎవరయినా కుర్ర వాడు తలుపుతోసి గడియవేయడం మరచి పోతే గాలికి అలా చప్పుళ్లు అవుతున్నాయా?

చిరాకుగా కుర్చీలోంచి లేచాడు.

జయ ఎందుకింత ఆలస్యంచేస్తోంది.

తనకోసం ఎదురుచూస్తూ ఉంటానని ఎరుగదు గనుకనా? ఏదో రంగుచీర కట్టుకువస్తోంది.

ప్రసాద్‌కు అందంతంటె ఒడమనిషి కావాలి.

పెళ్లి, పిల్లలు, సంసారం యిలాంటి

మామూలు విషయాలు మాట్లాడే మనిషి కాదు. అతని మనసు ఒకటే ఆరాట పడుతోంది. కాని రోజులో ఒక గంటో అరగంటో తప్ప తనతో మాట్లాడేందుకు సమయంలేక సంగీతం వేదాంతం తప్ప మరో విషయం తెలియక— గట్టిగా ఊపిరి పీలిస్తే ఆమడదూరం వెళ్ళిపోయే మనిషిగాదు.

కాని అతనితో తనకు కావలసిన జీవితం గడపవలసిన మనిషి వెళ్ళిపోయింది. ఉన్నగూడు చాలాలేదనీ తన అవసరాలకు చాలని విశాలమయిన గూడు కట్టుకుందుకు ఎగిరిపోయింది— పక్షిలాగ. చెప్పకుండా చేయకుండా అంతర్ధానం అయిపోయింది.

ప్రసాద్ గుండెలు ఎండిపోయాయి.

అతని హృదయం యిప్పుడు పల్లవించదు

ఎప్పుడయినా చిగురించినా ఆ చిగుళ్లను ఉడుతలు, పక్షులు కొరికి కొట్టివేయవలసిందేనని వాటికి మరోదారి లేదు. ఇంకో 'మనుగడ' సాధ్యంకాదు.

జీవితంలో 'ఫిడేలు' వాయించటానికి పుస్తకాలు చదవటానికి తప్ప యింకెందుకూ పనికిరాని మనిషి తను.

ఇవి రెండూ ఇంకెవరికీ అక్కర్లేని పనులు.

ఎవరినీ ఆకట్టుకోనివి.

కాని జయమాత్రం యీ రెండింటి కోసరమే తనను ప్రోత్సహిస్తోంది. తను ఫిడేలు వాయిస్తూవుంటే మూగగా వింటూ కూర్చుంటుంది. తను చదువుకుందుకు అవసరంఅయిన పుస్తకాలు తెచ్చియిస్తూ వుంటుంది. ఆమె కూడా రాకపోతే జీవితమే అక్కర్లేదు. లేకపోతే యింకిపోవడమే మేలు.

ఆమె బట్టలు తనదగ్గర తాకట్టు వుండిపోయినాయి.

అందుకనే ఆమె తిరిగి తిరిగి వస్తుంది. ఏదో వేళకు వచ్చి తనను పలకరించి వెళ్ళిపోతుంది.

సాయంత్రం బయటకు వెళ్ళి తిరిగి వద్దాం అనిపిస్తుంది అతనికి. కాని గదిలో నుంచి బయటకువెడితే ఆ సమయంలో ఆమె వస్తే! భయం వేస్తుంది తలుచుకుందుకే.

పగలంతా గదిలోనే వుండడంవల్ల శరీరం గడ్డకట్టుకుపోయి వుంటోంది. మనస్సు పరిపరివిధాల పోతుంది.

తన జీవితంలో చాల భాగం ఎవరో ఎత్తుకుపోయారు. ఎవరు— యీ పని చేసింది? అతని ఊహకు మాత్రం అందదు.

* * *

జయ వస్తూనే కొత్త విషయం చెప్పింది.

"ఆమె కనిపించింది" అంది.

పేరుతో నిమిత్తంలేదు. ఆమె అంటే

ఎవరో ప్రసాద్‌కు క్షుణ్ణంగా తెలుసు.

కళ్లు ఎత్తి జయవంక ప్రశ్నలు కురిపిస్తూ చూశాడు.

"బాగానేవుంది. ఇదివరకటి కన్నా ఉత్సాహంగానే వుంది" అంది జయ.

ప్రసాద్ ముఖంలో ప్రశ్నలు యింకా అంతరించలేదు.

కాని వాటికి అక్షరరూపం మటుకు యివ్వడు అతను.

"శాస్త్ర దబ్బు యిబ్బందులలో వున్నట్లుంది. ప్రత్యేకించి చెప్పలేదుగాని నాకు అలా అనిపించింది. రేపు సాయంత్రం నా దగ్గరకు రమ్మన్నాను–"

ప్రసాద్‌కు కొంత నిశ్చింత అయింది.

తనవల్ల ఆమెకు మేలయిన 'ఉపకారం' జరిగితే అంతకన్నా యింకేం కావాలి

"ప్రసాద్, ఆమెను మీరు ఒకసారి కలుసుకోగూడదు?"

ప్రసాద్ ఉలిక్కిపడి చూశాడు జయవంక.

జయ వెంటనే "ఆమె చెప్పలేదనుకోండి. అయినా ఆమె ముఖకవళికలలో మిమ్మల్ని కలుసుకోవాలని ఆతురత కనిపించింది– నాకు. నాలో మిమ్మల్ని చూడటానికి ప్రయత్నిస్తోంది ఆమె."

ప్రసాద్ యేమీ మాట్లాడలేదు.

'ఈ జీవితంలో ఒక మొక్క. ముద్దమందారం అనుకున్నాను. తరువాత కలుపు మొక్క అని తేలింది. ఆ మొక్కను యిక్కడికి యెందుకు తెచ్చుకోవాలి?'– అనుకున్నాడు కొన్ని క్షణాలు.

కాని యేది మందారం?

యేది కలుపుమొక్క?– ఎట్లా నిర్ధారణ చేసుకోవడం?–అని మనస్సులోనే మధనపడుతున్నాడు.

జయ అతన్ని గమనిస్తూ వుండిపోయింది.

ఈరోజు యేదయినా కొత్తరాగం వాయించమని అడగాలని ఆమె అభిలాష.

కాని పాతరాగాలకే పదునుపెట్టటం మంచిదా అనిపిస్తోంది మల్లీని.

ఆమె వెళ్లిపోయేముందు అడిగింది, అతి నిదానంగా వినిపించీ వినిపించనట్లుగా "ఆమెకు యేమయినా చెప్పమంటారా?" అని.

"నీ యిష్టం" అన్నాడు ప్రసాద్.